# అన్వేషణ

రచన:
శ్రీ ఘట్టి కృష్ణమూర్తి

ఒక నాడు పార్కులో కొంతమంది స్నేహితులుకూచుని మాట్లాడుకుంటున్నారు. ఒకరినొకరు సరిగా అర్థం చేసుకోకలిగిన వాళ్లు. చిన్నతనంనుంచీ ఈ విషయంలో మాత్రం అందరూ సమానంగా పెరిగారు. ఒక విషయంలో అందరూ సమానమైన ఉపజ్ఞ కలవారు కాకపోవచ్చును. కాని ఒకరినొకరు ఎంతస్వతంత్రంగానైనా మాట్లాడుకోకలరు. రహస్యవిషయాలు చెప్పకూడనివి, అంటూ వాళ్లలో వుండవు. ఎంతమాటైనా కుండపగలకొట్టినట్లు అనెయ్యటమే వాళ్లందరికీ అలవాటు. దీనివల్ల మరొకడి మనస్సుకు కష్టం కలిగించిన వాళ్లమౌతామేమో అనే ఆలోచన వాళ్లలో ఎవరికి వుండదు...అదేమిటి ఇదేమిటి వాళ్లనోళ్లకు హద్దూపద్దూ వుండదు. అంతే బాగుంటుందేమో......

అందరూ సభతీర్చి కూచున్నారు. ఒక్కడు తక్కువైనాడు. అతనే సీతారాముడు. అందులో ఎవడో అననే అన్నాడు...సీతారాముడు ఇవ్వాళ గైర్‌హాజర్ అయ్యాడే...అని. కాని అతనులేనిలోపం కనపడకుండా వున్నవాళ్ళే ఎలాగొఅలా పూర్తిచేస్తున్నారు.

సంభాషణలన్నీ జోరుగా సాగిపోతున్నాయ్. కొంతసేపటికి ఒకప్రక్కనుంచి సీతారాముడు మెల్లిగావస్తున్నాడు. చేతులో వున్న పేపరు చూసుకుంటూ దగ్గరకొచ్చిన కొద్దీ... ఆ...నువ్వేతక్కువైనావ్ అందరూ వున్నారు సభలో...అన్నాడొకడు, సిగరెట్టుకొడి విదిలించుతూ. వినావాడిప్పుడు పెద్దమనిషి అయినాడుటలే అన్నాడు. మరొకడు సిగరెట్టు నోట్లోపెట్టుకుని అగ్గిపుల్లగీసి ముట్టించపోతూ, తెలిసీ తెలియని ముద్దమాటలతో...ఇంకొకడు సీతారాముడి మొహంవంక ఏదోసాభిప్రాయంగా చూస్తూ, చూచావోయ్ భాయీ " అన్నాడు. సీతారాముడు పేపరు మధ్యగావేసి, కూచునేసరికి, అందరూపగలపడి నవ్వసాగారు. ఎవడికివాడు మరొకడి మొహంవంక సాభిప్రాయంగా చూస్తాడు. ప్రక్కన మరొకంటితో సీతారాముణ్ణికూడ, చూస్తూంటాడు. ఆచూపుతో ఇద్దరికీ ఏదో భావం వ్యక్తమయినట్లు పక్కుననవ్వుకుంటారు. మరికొంతసేపటికి అది అందరికీ అంటుకుంటుంది. విరగపడి నవ్వుతారు ఎవడికివాడే. నాకేదో అభిప్రాయంతోచింది. నవ్వుకున్నాను అనుకుంటాడు. కాని, ప్రక్కవాడు ఏఅభిప్రాయంతో నవ్వాడో తనకూ తెలియదు. మధ్య మధ్య, అరే..పోనీయండిరా పాపం! అంటాడు మరొకడు సీతారాముడివంకకు చూస్తూ...ఏదోవోదారుస్తున్నట్లు. మరొకడు చెవ్విదగ్గరకొచ్చి రహస్యమంతా తనకే తెలిసినట్లూ, అది. అతని చెవులో చెబుతున్నట్లూ ఏమిటో ఏమిటో గొణుగుతాడు. మళ్లీ అవతలకు వెళ్లి అందరితో పాటు కలిసి నవ్వటం మొదలు పెడతాడు. మరొకడొచ్చి, వోరే భాయీ! వాళ్లంతా వొట్టిఫూల్‌స్ వాళ్లతో మనకేం పని, గానీ అంటూ దూరంగా తీసుకుపోతాడు. వెనకనుంచి అందరూ తప్పట్లుకొడుతూ కేకలువేస్తూ నానారసాభాసా చేస్తారు...

ఒక అరగంటసేపు ఈ విధంగా జరిగింది, ఒక్కమాటైనామాట్లాడలేదు సీతారాముడు. అసలు మాట్లాడటానికి అతనికి అవకాశమే దొరకలేదు. మెదలకుండా వూరుకున్నాడు అందరివంకకూ తేరిపార చూస్తూ...

అందరివలే విజ్ఞానవంతుడు కాకపోవచ్చును, అందరికీ వున్న డిగ్రీలు తనకు లేకపోవచ్చును. కాని, ఇతరులు- తనని ఏమంటున్నదీ, తెలుసుకోలేనంతటి మూఢుడు కాడు. అందరూ తనకి ప్రాణస్నేహితులే, కాని తన్ను చూసేసరికి ఎన్నడూలేని చలనం వాళ్లలో ఎలా కలిగిందో...అనే జిజ్ఞాస అతనిలో ఎక్కువైంది. తనురావటంతోనే ఇలా పగలపడి

నవ్వటం తలాక విధంగాను మాట్లాడటం, ఇదంతా చూస్తే, ఇంతవరకూ తనని గురించే మాట్లాడుకుంటున్నారని తోచింది. ఐతే, ఇవ్వాళ తను క్రొత్తవాడు కానుగా...రోజూ ఒకర్ని గురించి మరొకరు మాట్లాడుకుంటూండం సహజమే. కాని, ఇవ్వాళజరిగింది మాత్రం అతనికి చాలా ఆశ్చర్యాన్నే కలిగించింది. నిర్విణ్ణుడై ఏమీ మాట్లాడక వాళ్లవంక దిగాలపడి చూస్తూ కూచున్నాడు. కొంతసేపటికి ఏమిటో మాట్లాడాలని అతని నోటివరకూ వొచ్చింది. మాట ఇంతలోకే..."ఏంరా భాయీ! నీకొమాట చెబుతాను" అన్నాడొకడు, దగ్గరగా జరుగుతూ, తలప్రక్కకు తిప్పి అతనివంక చూసేసరికి ఎదురుగుండా వున్నవాళ్లంతా ఘొల్లుమన్నారు. నవ్వు ఆపుకోలేక వాడు కూడా నవ్వుతూ, ఒకమాట అన్నాడు. సీతారాముడితో..." ఏదో సమస్య ఇస్తాను పూర్తిచేయాలి "అని. అందరూ, అతనివంకా సీతారాముడివంకా చూస్తూన్నారు. అతను చెబుతున్నాడు." ఒకడికి పెళ్లైయింది. కాని వాడే మీ చిన్నతనంలో చదువుకోలేదనుకో ......మరీ అంతజ్ఞానం లేని మొద్దూకాదు. పెళ్లాం వాడికంటె పెద్దచదువు చదివింది కాపరానికి కూడ వచ్చింది. అప్పుడు వాళ్ల సంసారం ఎలా వుంటుంది? ఆచదువుకున్న పెళ్లాం ముందరవాడు ఎలావుంటాడు, అసలువాడు చేయతగిందేమిటి?" ఇదో పొడుపు కథ అనుకో విప్పి సరిగా సమాధానం చెప్పాలి.—

అంతటితో అతను వూరుకున్నాడు. సీతారాముడు పేపరు తీసుకుని ఏమిటో చదువుతున్నట్లుగా దానివంక చూస్తూ కూచున్నాడు, ఒక్కసారి అందరి ముఖాలవంకా చూశాడు, తనేదో చెప్పబోతున్నట్లుగా, ఇంతలోకే మరొకడు అందుకుని, అసలు. దానికి సమాధానం వాడెందుకు చెబుతాడు? నేచెబుతా వినండి. ధర్మమ్మలు అంతాను. మీబుద్ధికి అంత మాత్రం సమాధానం దొరక్కపోయింది. నాన్‌సెన్స్ వొట్టి పీడబుర్రలాభాయీలు. ఇకవినండి... అంతా వింటున్నారు కాదు? ఒరేయ్! సీతారాముడు! నువ్వుకూడ వినాలి. సరిగా అర్థం చేసుకోవాలి...

"ఏం చేస్తాడా? నెత్తిన గుడ్డేసుకుని, ఇంట్లోనించిలేచి పోతాడు!! ......అరే అంతపనే... అంటూ, అందరూ పగలపడి నవ్వారు, ఆశ్చర్యాన్ని కూడ సూచించుతూ...అసలు పొడుపు కథ వేసినవాడు సీతారాముడి వంక చూశాడు. మెల్లిగా దగ్గరకొచ్చి. వొరేయ్, వీళ్లంతా ఫూల్స్ మనం లేదాం పద, అంటూ, రెక్కపుచ్చుకుని లేవతీయబోయాడు. తెలతెల్లబోతూ అందరూ లేచారు. సీతారాముడు కూడ లేవబోతుండగనే అందరూ వొచ్చేశారుఅతని కంటె ముందుగానే......

నడిచివెడుతూ వెనక్కుతిరిగి తనవంక చూసి ఫక్కున నవ్వుకునే సరికి, సీతారాముడికి ఇందతా ఏమిటూ? అనేసంశయం గాఢంగా వొడమూపింది. మెల్లిగా అడుగులోఅడుగు వేసుకుంటూ నాలుగడుగులు నడిచాడన్నమాట కాని మనస్సులో చాల చికాకుగా వున్నది, ఒళ్ళంతా బరువెక్కినట్లైంది. తనమీద ఏదోవొక పెద్ద బరువు పడినట్లు, ఇకముందుకు అడుగైనా కదలలేకపోయాడు. అప్పుడే వెలిగిన దీపంవంక తేరిపారచూస్తూ అక్కడే కూలబడ్డాడు సీతారాముడు, ఏమిటో విచారిస్తూ—

## 2

సుబ్రహ్మణ్యంగారి కుటుంబం మొట్టమొదట నుంచీ పట్టణంలో లేదు. వాళ్ళదీవూరు దగ్గరేఒక చిన్నపల్లెటూరు అందరూ అక్కడే వుంటూండేవాళ్ళు. నలభైయెకరాల పొలం. సొంతవ్యవసాయం వున్నది. ఆయనకి ఇద్దరేకొడుకులు ఒకకూతురు. పెద్దవాడు లక్ష్మీనారాయణ అతనికి పెళ్ళిఅయి, చాల రోజులైంది. కూతురు రాజమ్మకుకూడ పెళ్ళిఅయింది. కాపరానికికూడ వెళ్ళింది. ఇక సీతారాముడు మూడోవాడు ఇతనికి పద్నాలుగేళ్ళవయస్సులోనే పెళ్లైంది. మేనరికం, కలిసిన సంబంధం కదా అని చిన్నతనంలోనే చేశారు. అప్పటికే వరలక్ష్మి నాలుగో క్లాసో అయిదోక్లాసో చదువుతున్నది. పెద్దకొడుకు లక్ష్మీనారాయణ బి, ఏ, వరకూ చదివినాకూడ అందరూ పట్టణంలో కాపరం పెట్టాల్సిన అవసరంలేకపోయింది. ఎమ్. ఏ. వరకూ మేనత్తగారింట్లో వుండి

చదువుకున్నాడు. బి. ఏ. చదువుతుండగానే అతని భార్య కాపరానికి వొచ్చింది. అందుకని సంసార మంతా తర్లించుకువచ్చి ఇక్కడ వుండాల్సిన అవసరం అప్పట్లో అంతగాలేకపోయింది. కాని ఇప్పుడిప్పుడు అతనికి ఉద్యోగం అయి ఇక్కడే వుండిపోయిన తరువాత అందరూ బస్తీలోనే కాపరం పెట్టారు. అప్పటి ఆస్తులూ పాస్తులూ ఇప్పుడంతగా లేవు. ఉన్న పదిహేను ఎకరాలూ కట్టుబడికి ఇచ్చేశారు—

ఇంతవరకూ సీతారాముడు ఇంటిదగ్గరే వుండటంచేత ఏమీ అంతగా చదవనూలేదు. చదవటానికి వీలులేకపోయింది. చివరికి, బస్తీలో కాపరం పెట్టిన నాలుగైదేళ్ళనుంచైనా ఏమీ చదవనూ లేదు కూడాను—సీతారాముడి పెళ్ళైన కొన్నాళ్ళకే వెంకటరత్నంగారు ఈవూరినుంచిబదిలీఅయి మరోవూరుకెళ్ళిపోయాడు అప్పటినుంచీ వరలక్ష్మి స్కూల్ ఫైనల్ పూర్తయింది. ఇంటర్మీడియెట్ చదవటానికి కాలేజీలో ప్రవేశించింది కూడ కాని, అత్తవారి బలవంతంవల్ల అయిష్టతవలన, కూతుర్ని చదువుమానిపించాడు వెంకటరత్నంగారు కాపరానికికూడ పంపించివేశాడు—

తన భర్త చదువుకున్నాడా? లేదా? అన్న ప్రశ్నఎన్నడూ వరలక్ష్మి మనస్సులో కలగలేదు. తను చదువుకోవాలనే ఉత్సాహంతోటే ఇంతవరకూ చదువుకున్నది. అసలు వరలక్ష్మి చదువుకున్నన్నాళ్ళూ అల్లుడి సంగతి అంతగా అనుకోలేదు కూడాను వెంకటరత్నంగారు. కాపరానికి వొచ్చిన దగ్గర నుంచీ ఒక్కనాడు కూడ తన భర్తతో ఈ విషయమై ఏమీ అనలేదు. వరలక్ష్మి తనభర్త చదువుకోలేదని తనకంటె కూడా...అని తనకు తెలుసును. కాని మనస్సులో విసుక్కునిగాని, తన భర్తకు ఉద్యోగంలేదని చీటికీ మాటికీ ఆక్షేపించిగాని ఎరుగదు. చదువుకున్న తన జీవితానికి గుదిబండలాగ ఈ సంబంధాన్ని అంటకట్టారని ఎన్నడూ మనస్సులోనైనా అనుకోలేదు. తనకీ సీతారాముడికీ ఎన్నడు జరిగిందో ఈ పెళ్ళి, కాని ఇద్దరికీ అంతమాత్రం ఇంగితజ్ఞానం అప్పట్లో లేకపోయింది. ఇప్పుడు తను విజ్ఞానవతి అయినది. అతనికంటెకూడా లేమో... అయినాకాదని కాలతన్నలేదు. మనసులో ఏదో... నిత్యమూ సంతోషంగానే వుంటున్నది వరలక్ష్మి...

సీతారాముడు తనని గురించి విచారించవలసిన అవసరం లేకపోయింది, వరలక్ష్మికీ తనకీ పెళ్ళి అయినప్పటినుంచీ ఆవిడ ఏం చదివిందో తెలుసు. కాని, తను చదవలేకపోయానే, అనేవిచారం అతనికి ఎన్నడూ కలగలేదు, భార్యకంటె తక్కువవాడినే, అని మనసులో ఎన్నడూ విచారపడలేదు.

## 3

సీతారాముడు అక్కడ కూచుని విచారించినకొద్దీ ఇందాక వాళ్ళు అడిగిన మాటలు శూలాల్లా తన హృదయంలో గుచ్చుకుని బాధించుతున్నాయ్. వాళ్ళు నవ్విన నవ్వులు భగభగా మంటలు మండుతున్నట్లున్నాయ్...తన్ను చూసి అందరూ ఇవ్వాళ ఎందుకు నవ్వారో ఏమీ అర్థంకాలేదు. అసలు వాళ్ల పొడుపుకధ తనకెందుకడగాలి? అందరూ తనకు ప్రాణస్నేహితులే, అందరిలోనూ మాట్లాడగల స్వాతంత్రం తనకుకూడ వున్నది. క్రిందటి క్షణంవరకూ తన మనసులో అనుకోని సంఘటన ఇది అంతటి ప్రాణస్నేహితులలో నుంచీ తను ఒకడుగా వేరయాడు. లేకపోతే వాళ్ళందరికీ వుండి తనకులేని ఏదో వొక హక్కు, తనని వాళ్ళనుంచి వేరుచేసిందేమో. వాళ్ళకున్న ఆ హక్కు అంతబలీయమైనదికావున్నతనకూ వాళ్ళకూవుంటే మైత్రినికూడ మరిపింపచేసింది. ఇప్పుడు తను వేరు. వాళ్ళు వేరు, ఇంకా వాళ్ళలో తనకు స్థానంలేదు. వాళ్ళలో ఏమిటి? తన భార్యదగ్గరే తనకు స్థానంలేదేమో..."ఇది నిజమేనా?...అనుకున్నప్పుడు ఏమో" అనే అస్పష్టమైన సమాధానమే తనకు వినపడుతున్నది—తన విజాయితీలో తనకు నమ్మకమున్నదా? అసలు వుంటే వాళ్ళన్నమాటలకి తనకి విచారం ఎందుకుకలగాలి? వరలక్ష్మి తననే విధంగాను చిన్నతనంగా చూడలేదు. ఇద్దరి మనస్సులూ ఏకమై ఒకబాటలో పరుగులు తీస్తున్నాయ్ కాని ఇప్పుడెందుకనో...

(సశేషం)